నితిన్ నయా లుక్స్



హీరో నితిన్ శనివారం తన పుట్టిన రోజును జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నటిస్తున్న తాజా సినిమాలు'రాబిన్‌హుడ్' 'తమ్ముడు' నుంచి స్పెషల్ బర్త్‌డే పోస్టర్స్‌ను విడుదల చేశారు. 'రాబిన్‌హుడ్' చిత్రానికి వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. వినోదాత్మక యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నితిన్ దొంగ పాత్రలో కనిపించనున్నారు. తాజా పోస్టర్‌లో ఆయన ట్రెండీ లుక్‌లో స్టైలిష్‌గా ఉన్నారు. సీక్రెట్ ఏజెంట్‌లా ఆయన లుక్స్ అందరిని ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్నందిస్తున్నారు. ఇక 'తమ్ముడు' చిత్రానికి వేణు శ్రీరామ్ దర్శకత్వం వహిస్తుండగా..శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు శనివారం ఈ సినిమా టైటిల్ లోగోతో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నితిన్ ఓ బస్సుపై కూర్చొని తీక్షణమైన చూపులతో కనిపిస్తున్నారు. ఆయన చేతిలో శూలం ఉంది. నితిన్ గత చిత్రాలకు పూర్తి భిన్నమైన పాత్రలో కనిపిస్తారని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి 'కాంతార' ఫేమ్ బి. అజనీష్ లోక్‌నాథ్ సంగీతాన్నందిస్తున్నారు.

'ఓ భామ అయ్యో రామ' ప్రారంభం

సుహాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఓ భామ అయ్యో రామ' శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రామ్ గోదాల దర్శకుడు. వి ఆర్ట్స్, చిత్రలహరి టాకీస్ పతాకాలపై హరీష్ నల్లా, ప్రదీప్ తాళ్లపు రెడ్డి నిర్మిస్తున్నారు. మాళవిక మనోజ్ కథానాయికగా నటిస్తున్నది. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర నిర్మాత దిల్‌రాజు క్లాప్‌నివ్వగా, దర్శకుడు వశిష్ట కెమెరా స్విచాన్ చేశారు. ఇదొక అందమైన ప్రేమకథా చిత్రమని దర్శకుడు తెలిపారు. కథానుగుణంగా మంచి ఆర్టిస్టులు కుదిరారని, వైవిధ్యమైన కథతో అన్ని వర్గాలను మెప్పిస్తుందని నిర్మాతలు పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా సెకండ్ ఇన్సింగ్స్‌ను మొదలుపెడుతున్నానని 'నువ్వు నేను' ఫేమ్ అనితా హస్సానందని చెప్పింది. ఈ చిత్రానికి కెమెరా: మణికందన్, సంగీతం: రధన్, ఆర్ట్: బ్రహ్మ కడలి, కో ప్రొడ్యూసర్: ఆనంద్ గడగోని, రచన-దర్శకత్వం: రామ్ గోదాల.

మనసు అనేది కోతి అని ఊరకే అనరు కదా..

'మరణం అంటే నాకు భయం. ఒకవేళ నేను చనిపోతే నా కుటుంబసభ్యుల పరిస్థితేంటి? అని ఒక్కోసారి ఊహించుకుంటూ ఉంటాను. అప్పుడు తెలియని భయం నన్ను ఆవహిస్తూ ఉంటుంది. ఓ విధంగా ఇది నా మానసిక దౌర్బల్యం' అంటున్నది అందాలభామ మృణాల్‌ఠాకూర్. ఇటీవల తన వ్యక్తిగత విషయాల గురించి ఇన్‌స్టాలోని అభిమానులతో చిట్‌చాట్ నిర్వహించింది మృణాళ్. 'సెలబ్రిటీగా ఉండటం నిజంగానే అదృష్టం. ఈ ప్రపంచం నిన్ను గుర్తుపడుతుందంటే నువ్వు సాధించినట్టే కదా, అలాగే నీ మాటకు సమాజంలో విలువ ఉంటుంది. సమాజాన్ని మార్చే బలం నీకుంటుంది' అంటూ చెప్పుకొచ్చింది మృణాళ్‌ఠాకూర్. మరి సెలబ్రిటీగా ఉండటం వల్ల నష్టాలు? అనడిగితే– 'కుటుంబంతో ఎక్కువకాలం గడపలేం. ఒక్కోసారి ముఖ్యమైన పరిస్థితుల్లో ఫ్యామిలీకి దూరంగా బతకాల్సొస్తుంది. అసలు ఈ బాధలన్నీ ఎందుకు? చక్కగా ఇరవైల్లోనే పెళ్లాడేసి, ఇద్దరు పిల్లల్ని కనేసి, భర్తతో కలిసి చక్కగా వారానికోసారి రెస్టారెంట్‌కి వెళ్లేసి, హాయిగా తినేస్తూ, జీవితాన్ని సరదాగా గడిపేయొచ్చుకదా.. అని అప్పుడప్పుడు నాకూ అనిపిస్తుంటుంది. మనసు అనేది కోతి అని ఊరకే అనరుకదా..' అంటూ అందంగా నవ్వేసింది మృణాళ్‌ఠాకూర్.

స్నేహితులు అందించే 'వైబ్'

'ఊరిపేరు భైరవకోన' చిత్రంతో ఇటీవలే మంచి విజయాన్ని అందుకున్నారు హీరో సందీప్‌కిషన్. ఆయన నటిస్తున్న తాజా చిత్రానికి 'వైబ్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. స్వరూప్ ఆర్‌ఎస్‌జే దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్కా నిర్మిస్తున్నారు. శనివారం టైటిల్ ప్రకటనతో పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో సందీప్‌కిషన్ యాక్షన్ అవతారంలో కనిపిస్తున్నారు. చేతిలో హాకీ స్టిక్స్ పట్టుకున్న మిత్ర బృందం పోరాటానికి సిద్ధమన్నట్లుగా కనిపిస్తున్నారు. 'కాలేజ్ బేస్డ్ యాక్షన్ లవ్‌స్టోరీ ఇది. ఓ సాధారణ స్నేహితులు వ్యవస్థను ఎదిరించే రెబల్స్‌గా మారే వైనం ఆసక్తిని కలిగిస్తుంది. వచ్చే ఏడాది వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చిత్రబృందం పేర్కొంది.

తమిళ నటుడు డేనియల్ బాలాజీ కన్నుమూత

తమిళ నటుడు డేనియల్ బాలాజీ (48) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. అర్ధరాత్రి ఛాతినొప్పి రావడంతో ఆయన్ని చెన్నైలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. విలన్ పాత్రల ద్వారా ఆయన గుర్తింపును పొందారు. దక్షిణాదిలో దాదాపు 50కిపైగా చిత్రాల్లో నటించారు. తమిళంలో వడ చెన్నై, కాక్క కాక్క, వేట్టైయాడు విళయాడు, తెలుగులో సాంబ, ఘర్షణ, చిరుత, టక్ జగదీష్, సాహసం శ్వాసగా సాగిపో వంటి చిత్రాల ద్వారా ప్రేక్షకులకు చేరువయ్యారు. తమిళ టెలీ సీరియల్స్ ద్వారా నటుడిగా ఆయన కెరీర్ ఆరంభించారు. 'చితి' అనే ధారావాహికలో ఆయన డేనియల్ అనే పాత్రను పోషించారు. దానికి మంచి గుర్తింపు దక్కడంతో తన పేరు ముందు డేనియల్‌ను చేర్చుకొని డేనియల్ బాలాజీగా సినిమాల్లో కొనసాగారు. ఫిల్మ్ మేకింగ్ కోర్స్ చేసిన డేనియల్ బాలాజీ దర్శకుడు కావాలని ఇండస్ట్రీకి అడుగుపెట్టి నటుడిగా స్థిరపడ్డారు. తెరపై విలన్ పాత్రలు పోషించినప్పటికీ నిజ జీవితంలో మాత్రం సేవా కార్యక్రమాల ద్వారా గొప్ప మనసును చాటుకున్నారు. అవివాహితుడైన డేనియల్ బాలాజీ అనేక గుప్తదానాలతో వితరణశీలిగా పేరు తెచ్చుకున్నారు. తాను సంపాదించిన డబ్బులను ఓ గుడిని కట్టించడానికి ఉపయోగించాడు. డేనియల్ బాలాజీ మృతిపట్ల పలువురు దక్షిణాది సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

'దసరా' కాంబో రిపీట్

నాని కథానాయకుడిగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన 'దసరా' చిత్రం బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. నానికి మాస్ ఇమేజ్‌ను తీసుకొచ్చింది. వంద కోట్ల వసూళ్లతో రికార్డు సృష్టించింది. శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ కాంబినేషన్ మరోమారు రిపీట్ కానుంది. నాని-శ్రీకాంత్ ఓదెల రెండో చిత్రాన్ని శనివారం ప్రకటించారు. ఈ సందర్భంగా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఎరుపురంగులో పెయింట్ చేయబడ్డ ఈ పోస్టర్ వయొలెన్స్‌ను సూచిస్తున్నది. గడ్డం పెంచి మెలితిప్పిన మీసాలతో నాని మాస్ అవతారంలో కనిపిస్తున్నారు. 'యూ డోంట్ నీడ్ ఆన్ ఐడెంటిటీ టు బీ ఏ లీడర్' అని పోస్టర్‌పై రాసిన క్యాప్షన్ సినిమా కాన్సెప్ట్‌ను తెలిపేలా ఉంది. 'ఈ చిత్రంలో నాని పవర్‌ఫుల్ మాస్ పాత్రలో కనిపిస్తారు. భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం. 2025 వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి నిర్మాత: సుధాకర్ చెరుకూరి, రచన-దర్శకత్వం: శ్రీకాంత్ ఓదెల.

అరుదైన కథ 'లవ్‌మీ'

ఆశిష్, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'లవ్‌మీ'. దిల్ రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత, నాగ మల్లిడి నిర్మిస్తున్నారు. అరుణ్ భీమవరపు దర్శకుడు. 'ఇఫ్ యు డేర్' ఉపశీర్షిక. ఈ చిత్రం నుంచి 'రావాలి రా' అనే పాటను శనివారం అగ్ర నిర్మాత దిల్‌రాజు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఐదుగురు సింగర్స్‌తో కీరవాణి ఈ పాట పాడించారు. మెలోడియస్‌గా ట్యూన్ చేశారు. ఇప్పటివరకు రానటువంటి చాలా కొత్త కథ ఇది. ఘోస్ట్ లవ్‌స్టోరీ. సినిమా చూస్తున్నంత సేపు తర్వాత ఏం జరుగుతుందోననే ఉత్కంఠను రేకెత్తిస్తుంది. ఆశిష్ ఈ కథకు చక్కగా కుదిరాడు' అన్నారు. హారర్ థ్రిల్లర్ లవ్‌స్టోరీ ఇదని, ప్రేక్షకులు ఆద్యంతం థ్రిల్‌కు గురవుతారని హీరో ఆశిష్ తెలిపారు. ఘోస్ట్‌ను ప్రేమిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన నుంచి ఈ కథ పుట్టిందని దర్శకుడు అరుణ్ భీమవరపు చెప్పారు.

రియల్ లొకేషన్స్‌లో తీశాం

మలయాళ ఇండస్ట్రీలో 200కోట్లు వసూళ్లు సాధించిన తొలి చిత్రంగా రికార్డు సృష్టించింది 'మంజుమ్మల్ బాయ్స్'. యథార్థ సంఘటనల ఆధారంగా సర్వైవల్ థ్రిల్లర్‌గా తెరకెక్కించారు. చిదంబరం ఎస్ పొదువల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ తెలుగులో ఏప్రిల్ 6న విడుదల చేస్తున్నది. ఈ సందర్భంగా దర్శకుడు చిదంబరం ఎస్ పొదువల్ మాట్లాడుతూ 'కొడైకెనాల్‌లోని గుణ గుహా నేపథ్యంలో నడిచే కథ ఇది. కేరళ మంజుమ్మెల్ పట్టణానికి చెందిన కొందరు స్నేహితులు గుణ కేవ్స్‌కు వెళతారు. వారిలో ఓ వ్యక్తి గుణ గుహలో చిక్కుకుపోతాడు. అతన్ని రక్షించడానికి మిత్రబృందం చేసిన ప్రయత్నాల నేపథ్యంలో ఈ కథ ఆద్యంతం ఆసక్తిగా నడుస్తుంది. ఈ సినిమా కోసం రియల్ మంజుమ్మెల్ బాయ్స్‌ను కలిసి వివరాల్ని సేకరించాను. ఈ సినిమా తీయడానికి మూడేళ్ల సమయం పట్టింది. చాలా వరకు రియల్ లొకేషన్స్‌లో షూటింగ్ జరిపాం. 'గుణ' చిత్రంలోని 'కమ్మని నీ ప్రేమ లేఖలే రాసింది హృదయమే..' పాటను ఆ గుహలోనే చిత్రీకరించారు. అందుకే సినిమా ఆరంభంలో ఈ పాటను ఉపయోగించాం. కమల్‌హాసన్ ఈ సినిమా చూసి మంచి ప్రయత్నం చేశారని మమ్మల్ని అభినందించారు. తెలుగులో మైత్రీ మూవీ మేకర్స్ ద్వారా ఈ సినిమా విడుదల కావడం ఆనందంగా ఉంది' అన్నారు.